

# హాఠ్ఠ...!

## కె.కె. రఘునందన

"మీ కథలు సంపుటిగా తేవాలేగాని ఎగరేసుకు పోరూ?" అందరూ అనగానే అంతెత్తుకు ఎగిరి పోయి కథల సంపుటి అచ్చొత్తించి చేతులు కాల్చుకున్నాడు ప్రముఖ రచయిత పాపారావు.

పుస్తకావిష్కరణకు వచ్చిన సంఖ్య దండిగానే వున్నా పాపారావు పుస్తకం కొనకుండా మొండిగా వెళ్లిపోయారు జనం.

వాళ్లకీ వీళ్లకీ కొన్ని పుస్తకాలు అంటగట్టాడు. వాళ్లు రేపు మాపు అంటూ తిప్పి పది పరక చేతిలో పెట్టారు. కొందరు పబ్లిషర్స్ అమ్మకాలు అయినాక డబ్బు పంపిస్తామన్నారు. ఈ విషయంలో - పాపారావుకి పెళ్లానికీ ప్రతిరోజూ యుద్ధమే.

చివరికి - మిగిలిన పుస్తకాలను కిళ్లీ కొట్లకీ, పుస్తకాల షాపు వారికీ అమ్మమని ఇచ్చాడు. కనీసం వారానికి ఒక పుస్తకం చెల్లినా ఈ ఏడాదిలో కొంత సొమ్ము ముట్టడం ఖాయమని తలచాడు.

కాంప్లెక్సులో పెద్ద పుస్తకాల షాపుకి ఓ అయిదు ప్రతులు - అమ్మకానికి ఇచ్చాడు. అక్కడికి వచ్చే వేల జనంలో ఒక్కరైనా తన సంపుటి కొనక పోతారా అని నమ్మకం. అయితే అతని నమ్మకం వమ్మయింది. వారాలు గడుస్తున్నా ఎక్కడి పుస్తకాలు అక్కడే ఉన్నాయి.

ఆ షాపువాడి నడిగితే - 'వాస్తు పుస్తకాలు, గంటల పంచాంగాలు చెల్లుతున్నాయి గాని మీది ఒక్కటీ చెల్లలేదు' అని నిట్టూర్చాడు.

జుత్తు పీక్కోవాలనిపించింది పాపారావుకి.

పుస్తకాల గురించి దాదాపు అడగటం మానేశాడు.

అయితే ఓ రోజు విశాఖపట్నం వెళ్లాలని కాంప్లెక్సులోకి అడుగు పెట్టాడు. ఎప్పటిలాగే పాపారావు దృష్టి పుస్తకాల షాపుపై పడింది.

తను ఇచ్చిన అయిదు ప్రతులకు నాలుగే వేలాడుతూ దర్శన మిచ్చాయి. అంటే ఒకటి చెల్లిందన్నమాటా!! లేక చోటు చాలక లోపల పడేశాడా!

వెంటనే అడిగితే షాపువాడు డబ్బుల కోసం నస పెడ్తున్నట్లుగా భావించి విసుక్కుంటాడే మోనని ఔదాసీన్యం వహించాడు పాపారావు.

తరువాత హడావుడిగా బస్సెక్కాడు. సీటులో చతికిల పడ్డాక ఎందుకో అతని దృష్టి ముందుసీట్లో ఆసామీ చేతిలోని పుస్తకంపై పడ్డది.

ఓహ్ ! అది తన కథల సంపుటే !

మంచి ముఖ చిత్రంతో అతని హస్తాల్ని అలంకరించి ఉన్నది.

ఇంత కాలానికి తన కథల మీద మక్కువతో ఖర్చుపెట్టి కొనుక్కున్న పాఠకుడిని స్వయంగా చూశాడు. అంతకంటే రచయితకి తృప్తి ఏది?

ఆ పుస్తకం చదువుతున్న ఆసామీ ఏవో ముసిముసిగా నవ్వుకుంటున్నాడు.

తన కథల్లో రెండు మూడు హాస్య కథలు కూడా ఉన్నాయి. అవే చదువుతున్నాడు కాబోలు నను కున్నాడు పాపారావు.

బస్సు గమ్యం చేరింది.

తన సంపుటిపై అభిప్రాయం అడగాలని అతని వెనుకే వెళ్లాడు పాపారావు.

"మీరీ సంపుటి చదివారు కదా! ఎలా వుంది?" బాగుందంటే రచయిత తానేనని చెబుదామని ప్రయత్నం.

"దీన్ని చదివానా, పాడా! నాకేం తెలుసు. ఇదిగో దీనికోసం. నల్లగిరిలో, పట్టపగలు చదివితే బాగోదని..." అని ఓ పుస్తకం ఇలా చూపించి అలా బ్యాగులో పడేసి ముందుకు పోయాడు.

అది సెక్స్ పుస్తకం ! ○